



ఆచంట

## శారదాదేవి

సాయంత్రమైంది. అనాధాశ్రమం గుమ్మంలో బంతిచెట్ల దగ్గర పిల్లలంతా ఆడుకుంటున్నారు. పెరటి వేపు అరటి తోపు దగ్గర రాతి బండమీద కూర్చుని ఇద్దరు పిల్లలు ఏకాంతంగా ఏదో మాట్లాడుకుంటున్నారు. గొల్లపాకలో కాంతమ్మ కూర్చుని ఆవులకు పాలు పిండుతోంది. కొంచం దూరంగా

మయూరి అప్పుడే తోటలో కోసిన తోటకూర కాడలు ఏరుతోంది. ప్రక్కన విరబూచిన సన్నజాజి సువాసనలు నింపుతోంది. ఉదయం రక్తవర్ణంతో వికసించిన ఎఱ్ఱగులాబీలు ఇప్పుడే కమలినట్లున్నాయి. నీరెండ ఎఱ్ఱగా అన్నింటినీ కప్పుతోంది.

మయూరి ఆకాశంకేసి చూసింది. "ఎంత ఎఱ్ఱగా మెరిసిపోతోందో!" అన్నది స్వగతంలా! కాంతమ్మ వినిపించుకోలేదు. ఆమె తలవంచుకుని పని చేసుకుంటూ ఉండగానే సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, వెన్నెల రాత్రులు, చీకటి రాత్రులు వస్తూ పోతూ వుంటాయి. ఆమెకెప్పుడూ వాటిని చూచే తీరికలేదు.

కాస్సేపటికామె పాకలోనించి బయటికి వచ్చింది పాలబిందె చంకనపెట్టుకుని, తోటకూర గంపలోకెత్తి మయూరి లేచి నిలబడింది. ఆ సంజవేళ ఆమె ముఖమంతా ఎఱ్ఱగా మెరుస్తోంది. రెండు కళ్ళూ జ్యోతుల్లా మరింత ఎఱ్ఱగా కనిపిస్తున్నాయి. హఠాత్తుగా ఆమెను చూచిన కాంతమ్మ ఆశ్చర్యపడింది.

"నీ కళ్ళెందుకూ ఎప్పుడూ అలా ఎఱ్ఱగా ఉంటాయి? పుట్టినప్పటినుంచి అంతేనా?" అన్నది. మయూరి ఉలిక్కిపడింది. తొందరగా పమిటకొంగు లాక్కుని తల కప్పుకుంది. ముఖం కనపడకుండా తనకళ్ళు ఎఱ్ఱగా ఉండడం ఏదో దాచుకోవలసిన అపరాధంలా! మయూరి కాంతమ్మకు సమాధానం చెప్పలేదు. ఆమె మళ్ళా అడగనూలేదు. మాట్లాడకుండా ఇద్దరూ లోపలికి వెళ్ళిపోయారు. రాత్రి లోపల చెయ్యాలిసిన పనులింకా యెన్ని ఉన్నాయో ఆలోచించుకుంటూ!

కాని కాంతమ్మ అడిగినమాట మయూరి మరచిపోలేదు. ఆమెకు తన కళ్ళు ఎప్పటినుంచి ఎఱ్ఱగా ఉన్నాయో, ఎందుకున్నాయో చాలస్పష్టంగా తెలుసు. ఆమాట తలుచుకోగానే ఆమెకళ్ళు నీళ్ళతో నిండాయి. ఆ కన్నీరు జారిపడకుండా లోలోపలే ఇంకిపొయ్యేటట్లు కళ్ళు రెండూ గట్టిగా మలుపుకుంది. అవి ఇంకాస్త ఎఱ్ఱపడ్డాయి.

ఎప్పుడో మయూరి మధురమైన కోర్కెలు కోరుకుంది. అందరు ఆడపిల్లలాగే ఆశలు పెంచుకుంది. కాని పెళ్ళైన ఆరునెలలకే ఆమె కట్టుకున్నవన్నీ గాలిమేడలని తెలుసుకుంది. తాను అడుగుపెట్టింది నందనవనంలో కాదు. శూన్యమైన ఎడారిలో! నీడ వెతుక్కున్నది పూలచెట్లక్రింద కాదు, పాము పడగనీడలో! తనమెడలో సూత్రం కట్టినవ్యక్తి తనను సుఖపెట్టటానికి కాదు. మనస్సు శిథిలంచేసి క్షోభపెట్టటానికి!

ఎప్పుడో ఒక సంధ్యాసమయంలో ఒక వ్యక్తి తన జీవితంలోకి వచ్చాడు. అప్పటికే ఏదిక్కూలేక అడవిమార్గం పట్టిన తన జీవితాన్ని చూచి జాలిపడుతున్నట్లు తనతో అన్నాడు.

"నీ జీవితం నిరాధారంగా ఉంది. నీ హృదయంలో సుడిగుండం ఉంది. నీకు నేను అండగా ఉంటాను. ఆదుకుంటాను" అని.

ఆమె ఆ మాటలు నమ్మింది. తనకు తల్లిదండ్రులు లేరు. ఆదుకునే బంధు

వులు లేరు: అనాథగా గడచే జన్మకు ఆధారం దొరికినట్లయింది. ఆమె అతని చెయ్యి పట్టుకుంది. అతని ఇంటికి వెళ్ళింది,

ఇంట్లో అడుగుపెట్టిన మొదటిరోజు ఆమెకు గుప్పుమన్నది సారాయివాసన, వినపడినవి మోటుమాటలు. అందంగా అలంకరించుకుని ఆశతో ఎదురు చూస్తున్న ఆమెకు భర్త భయంకర వేషం భయం కలిగించింది. వణికిపోతూ అన్నది, "ఇది ఏమి వేషం? ఈ మొరటుతనం మానలేరా?" అని.

ఆ ప్రశ్న అతనికి అర్థంకాలేదు. ఆ ప్రార్థనలో ఉన్న ఆవేదన హృదయాన్ని తాకలేదు. అతను ఉంటున్నది మరొక ప్రపంచం! ఏదో ఒక క్షణాన మైకం తెలిసివున్నప్పుడు, ఒక ఆడదాన్ని ఆదుకుంటానని ఇంటికి తెచ్చానని సుఖపెడతానని మాట ఇచ్చానని అతనికి గుర్తులేదు. ఆమె అమాయకంగా కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "ఈ బ్రతుకు ఇంతేనా!" అనుకున్నది. ఆమె కళ్ళనీళ్ళు చూసి అతనికి జాలి కలుగలేదు. అహంకారమే ఎక్కువైంది.


"నన్ను పెళ్ళిచేసుకున్నానని ఏడుస్తున్నావా? దిక్కులేని నిన్ను ఆదుకుని తెచ్చానని సంతోషించక! ఎంతమంది ఆడపిల్లలు నన్ను చేసుకోవాలని ఏడుస్తున్నారు, ఎంతమందిని నీకోసం వదులుకున్నాను! రమణయ్య అంటే మామూలు మనిషి అనుకుంటున్నావు! ఈ ఊళ్ళో అంతా నాపేరు చెపితే హడలిపోతారు! నాతో ఒక్క నిమిషం కలిసి ఉండటానికి పడిచస్తారు:"

సారాతో మత్తెక్కిన ఆ మనిషి మొరటు ప్రేలాపన ఆమె గుండెల్లో కత్తులతో కోసినట్లయింది ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె ఏడ్చేకొద్దీ అతనికి చీదర ఎక్కువైంది. "ఛీ ఈ ఏడుపుగొట్టుమొహం నేను చూడలేను. ఏడుపు ఆపకపోతే నేను మళ్ళా ఈ గడప తొక్కను" అని గర్జించాడు. ఆమె ఏడుపు ఆపలేదు. అతను కసిగా ఆమెను రెండుసార్లు కొట్టాడు బలంగా. కణతన రక్తం కారేట్లు! ఆ ఏడుపు, ఆ రక్తము చూసి ఆమె తనకేదో మహా అపకారం చేసినట్లు మండిపడుతూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి అలా గడచింది. ఆ రాత్రి ప్రారంభించిన ఏడుపు ఆమె ఆపనేలేదు. బ్రతుకంతా అలానే గడచింది. కుమిలిపోయ్యే హృదయాన్ని కుంపటిలా భరించింది. ఎడతెగకుండా కారే కన్నీరు కనపడకుండా దాచుకుంది, ముఖ్యంగా రమణయ్య ఎదుట ఉన్న కాస్సేపు.

రమణయ్య అన్నమాట తప్పలేదు, మళ్ళా ఎన్నడూ ఆమెముఖం చూడలేదు ఆమెను ఆదరించలేదు. అసలు ఎన్నడూ కొంపకే రాలేదు. ఎప్పుడో ఆమెను ఏడిపించి మెడలో నగలో, పెట్టెలో డబ్బులో బలవంతంగా లాక్కుందామన్న ఆలోచన వచ్చినప్పుడు తప్ప! అతనికి స్నేహితులు, ప్రేమకలాపాలు, పేకాటలు అంతా ఇంటిబయట! ఎన్నాళ్ళకో ఒకరోజు కంటికి కనిపిస్తాడు! ఆ వేళ డబ్బుకోసం రాద్ధాంతంచేసి హింసించి వెళ్ళిపోతాడు.

మయూరికి ఏదిక్కూ లేకపోయినా




తల్లి చనిపోతూ ప్రేమతో ఇచ్చిన నగలు మాత్రం ఒంటినిండా ఉన్నాయి. రమణయ్య తనను చేరదీసింది ఆ నగల కోసమేనని ఆమెకు చాలా రోజులకు కాని తెలియలేదు. ఒక్కొక్క నగా ఒక్కొక్కసారి వచ్చి రమణయ్య హరించుకు పొయ్యాడు.

41 మొదటిసారి మయూరి సులభంగా ఇవ్వలేదు. "ఇవి నావి" అంది. "ఇవి మా అమ్మ నాకు ప్రేమగా ఇచ్చింది" అంది అతను రౌద్రాకారం దాల్చాడు, ఆమె తుఫానులో బెదరిన తీగలా వణికి పోయింది. అతను ఆమెను కొట్టాడు. ఆమె పెద్దగా ఏడ్చింది. ఆ ఏడుపు ఎక బడకుండా అతను ఆమెనోట గుడ్డలు కుక్కాడు. మెళ్ళో గొలుసు లాక్కున్నాడు. ఆమె చేతులతో గొలుసు పట్టుకుని పిచ్చిదానిలా పెనుగులాడింది. అతను బలమంతా వినియోగించి ఆమె చేతులు తొసివేసి గొలుసు లాగాడు. గొలుసు రెండుముక్కలై అతని చేతిలోకి వచ్చింది. అతను వెళ్ళిపోయాడు. ఆమె మెడంతా ఒరుసుకుపోయి ఎఱ్ఱగా వాచింది. ఆమె సొమ్మసిల్లి చాలా సేపు ఒళ్ళు తెలియకుండా పడుకుంది.

ఆ తరవాత ఆమె ఎప్పుడూ అత

నితో పెనగులాడలేదు. ఎప్పుడేది అడిగితే అది నోరెత్తకుండా తీసిఇచ్చింది. ఏ నగ అడిగితే అది ఇచ్చింది. డబ్బు అడిగితే పెట్టెలో ఉన్నది తీసిఇచ్చింది. ఎప్పుడూ అతనిని ఏమీ అనలేదు. ఏమీ చెప్పలేదు. తను ప్రాధేయపడినా, ఏమైనా చెప్పినా అది అతనికి అర్థం కాదు. తాను కన్నీరు పెట్టుకోటంవల్లా మంచిమాట చెప్పినందువల్లా అతనిలో రాక్షసత్వమే విజృంభిస్తుంది. అతను ఇంకా ఇంకా కసాయివాడై మనిషిని క్షోభపెడుతాడేకాని ప్రయోజనంలేదు అని తెలుసుకుంది. అందుకే నోరెత్తడం మానేసింది. ఇంటికి వచ్చినప్పుడు మాట్లాడకుండా అడిగినవి ఇచ్చింది. ఉన్నా కాసేపు భయపడుతూ దూర దూరంగా ఉంది. అతను వెళ్ళిపోయిన తరువాత ఉసూరుమని విశ్రాంతిగా ఊపిరి పీల్చుకుంది.

భగవంతుడు శూన్యంగా ప్రసాదించిన ఇంట్లో శూన్యంగానే బ్రతకటానికి నిశ్చయించుకుంది. ఏ కోర్కెలు కోరుకోలేదు. ఏ మమకారాలు పెంచుకోలేదు. ఇంటి నాలుగు గోడలమధ్య జీవవ సమాధి పొందింది. బయటి ప్రపంచంతో సంబంధం తెంపుకుంది. ఏవో పనులు కల్పించుకుంది. గడప దాటకుండానే బ్రతుకుతెరువుకల్పించుకుంది. శూన్యంగా జడంగా రోజులు గడిపింది.

ఎప్పుడైనా భర్త మారుతాడేమో, ఆదరిస్తాడేమోనన్న ఆశ చావలేదు. ఒక్కొక్కసారి అతను ఇంటికి వచ్చినప్పుడల్లా అతనిలో మార్పు ఉంటుందేమోనని భ్రమపడేది. అతను తనను ప్రియంగా పలకరిస్తాడేమో! ఆదరిస్తాడేమోనని ఆశపడేది. డబ్బుకోసరం తప్ప ఇంక దేనికోసరమూ అతను ఎప్పుడూ ఆమె దగ్గరకు రాలేదు. నగలు ఇమ్మని డబ్బు ఇమ్మనితప్ప ఇంకేమీ అతను ఆమెతో మాట్లాడలేదు. ఒక్కొక్కసారి అతనిని చూడగానే ఆమె హృదయం ఆసతో ఉప్పొంగేది. నిరాశతో శిథిలమై పాతాళానికి కృంగిపొయ్యేది.

పదేళ్ళు బ్రతుకు ఇలాగే సాగింది. అప్పటికి మయూరికి ఓర్పు నశించింది. బ్రతుకుమీద, భర్తమీద విసుగుపుట్టింది. మనస్సులో మమకారం శిథిలమై విరక్తి మొలకెత్తింది. ఆశలన్నీ అణగారి అసహ్యం కమ్ముకుంది ఇల్లు చెరసాలలా తోచింది. బ్రతుకుబానిసత్వంగాతోచింది. మనస్సు ఇందులోనించి బయటపడాలని పరితపించింది. ఎన్నడూ వీధి ముఖం చూడని మయూరి తలుపులు తెరచుకుని ముందర వసారాలోనే కాలం గడపటం ప్రారంభించింది.

ఒక రోజు శూన్యంగా వీధి కేసి చూస్తున్న ఆమెకు శివయ్య కనిపించాడు. ఆమె ఉలిక్కిపడింది. అతను ఆమె ప్రక్క ఇంట్లోనే ఉంటున్నా అతనిని ఆమె ఎప్పుడూ అదివరకు శ్రద్ధగా చూడలేదు. ఇవ్వాళ అతనెవరో క్రొత్త ఆకారంతో కనిపించాడు. అతనితో ఆప్యాయంగా చనువుగా మాట్లాడాలన్న చపలత్వం ఆమెలో అంకురించి ఆమెను నిలువనీయలేదు. అతను తనకెంతో ఆప్తుడులా తోచింది. అతనితో ఎడతెగకుండా తన మనోవ్యధలన్నీ చెప్పుకోవాలనిపించింది. అతనిని పిలవ

టానికి ఆమెకు సాహసం కలుగలేదు.

ఆతరువాత పిచ్చిదానిలా వీధి కని పెట్టుకునే కూర్చుంది. ఎప్పుడైనా ఒక క్షణం అతను కనిపిస్తాడేమో అన్న ఆశతో ఎదురు చూస్తూ; అతనిని చూడనిరోజు ఆమెకు మతిపోయినట్లని పించింది. ఒకరోజు నిలువలేక మసక చీకటివేళ ఆమె అతనిని పిలచింది. అతను ఆమెదగ్గరకు వచ్చాడు. ఆనం దంతో తెప్పరిల్లుకుని ఆమె మెల్లగా అన్నది. "చాలా రోజులుగా పిలవాలను కుంటున్నాను" ఆ గొంతులో జన్మ జన్మల తపన వినిపించింది.

"చాలారోజులుగా రావాలనుకుంటున్నాను" అన్నాడు తను అప్యాయంగా.

"ఎన్నో నీతో చెప్పాలని ఉంది" అన్నదామె.

"ఎడతెగకుండా వినాలని ఉన్నది" అన్నాడతను మురిపెంగా.

గుమ్మం ముందు ఆవేళ ఆమె పెట్టు కున్న కొవ్వొత్తి దీపం ఆరిపోయింది గాలికి. అతను ఆమెచేయి పట్టుకున్నాడు. ఆమెకు ఒక్కక్షణం ఏంచెయ్యాలో తోచలేదు. గాలికి తలుపురెక్కలు కొట్టు కున్నాయి. ఆమెకు భయంవేసింది. "నేను వెళతాను" అన్నది. అతను ఆమె చేతులు వదలిపెట్టాడు. ఆమె లోపలికి వెళ్ళిపోయింది.


చదవండి! చదివించండి!!

## వంశీ ప్రచురణలు

## "లత సాహిత్యం"

| | | | |
|---|---|---|---|
| నీలినీడలు | 3-00 | అంతరంగ చిత్రం | 4-00 |
| రాగజలధి | 3-00 | మిగిలిందేమిటి | 2 50 |
| ఆది మధ్యాంతాలలో | 5-00 | భగవంతుడి పంచాయితి | 2-50 |
| అలేఖ్య (శరత్ అసంపూర్తి నవల) | 5-00 | గాలిపడగలు, నీటిబుడగలు | 1-00 |
| | | లత వ్యాసాలు | 1-00 |
| జీవన స్రవంతి | 4-00 | లత నాటికలు | 2-00 |
| పదవిహీన | 4-00 | ప్రేమ రాహిత్యంలో స్త్రీ | 2-50 |
| వారిధ్య | 4-00 | పిచ్చివాళ్ళ స్వర్గం | 3-50 |

పుస్తక విక్రేతలకు ఏజంట్లకు గ్రంధాలయములకు సరసమైన కమీషను పై సకాలములో సక్రమముగా మీకే సాహిత్యము కావలసిన సప్లయిచేయగలవారము.

వివరములకు : వంశీ ప్రచురణలు,
హనుమాన్‌పేట :: విజయవాడ - 3.

కేవలం ఆమె ప్రాణం నిలవలేదు. అతని చేయి ఎందుకు వదలి వచ్చానని తపన పడింది. మళ్ళా ఆ క్షణమే అతని దగ్గరకు పారిపోవాలని పరితపించింది. ఆ క్షణంనుంచి ఆమె మరొక వ్యక్తిగా మారిపోయింది. ఆమె మనస్సు, శరీరము స్వాధీనంతప్పి శివయ్యకు బానిసగా మారిపోయినాయి. ఆమె కళ్ళముందు అతని ఆకారమే ఆవరించుకుని నిలచిపోయింది. అదితప్ప ఆమె కంటికి ఇంకేమీ కనిపించలెదు. కన్నుమూసినా తెరచినా. అతని రూపమే అన్నిచోట్ల అన్ని వస్తువులలోను కనిపించింది.

మరునాడు ఆమె శివయ్య వస్తాడని ఎదురుచూస్తూ కూర్చుంది. అతను రాలేదు. ఆ తరువాత చాలారోజులు అతను కనిపించలేదు. ప్రతిక్షణం అతని కోసమే పరితపిస్తున్న మయూరికి అది ప్రాణాంతకమైంది. రోజురోజుకు ఆవేదన అధికమైంది. క్రమంగా ఆమెకు మతి చలించింది. ప్రక్కనే అతని బంధువులంతా ఉన్నా అతనిని గురించి వారిని అడగడానికి ఆమెకు ధైర్యం చాలలేదు. ఒక్కక్షణం ఆప్యాయంగా తన చేయి పట్టుకున్న వ్యక్తి మళ్ళా కంటికి కనిపించకుండా ఉంటాడని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. క్రమంగా శరీరం కృశించింది. మనస్సు మగత బారింది. ఆమెలో ఏదో కనపడని వ్యాధి కమ్ముకుంది.

తన ప్రపంచంలో తానున్న రమణయ్య ఎప్పుడూ ఆమె కృశించిపోతోందని గమనించలేదు. ఒకసారి సంత జరిగింది. కొనఊపిరితోఉన్న మయూరికి ఒక ఆలోచన వచ్చింది. ఒకవేళసంతలో శివయ్య కనిపిస్తాడేమోనని, ఆ ఊహ వచ్చిన వెంటనే యెన్నడూ ఇల్లు కదలని ఆమె యిల్లు వదలి వెళ్ళింది. ఆమె ఆశ వ్యర్థంకాలేదు. సంతలో అడుగు పెట్టగానే ఆమెకు శివయ్య కనిపించాడు. ఆమె ముందాలోచన లేకుండా అతని దగ్గరకు పరుగెత్తి వెళ్ళింది. అతనిచేయి గట్టిగా పట్టుకుంది.

"నువ్వు యెక్కడికి వెళ్ళావు? ఇన్నాళ్ళు ఎందుకు కనిపించలేదు? నీవు లేకుండా నా ప్రాణాలు నిలువలెదు. ఒక్క క్షణమైనా నేను నీకు దూరంగా ఉండలేను."

గబగబా ఇన్నిమాటలు చెప్పిందామె స్పష్టంగా అతనితో!

మతిచెడిన ఆమెకు చుట్టూ జనం ఉన్నారన్న స్పృహలేదు. ఆ స్పృహ ఉన్న శివయ్య మెల్లగా ఆమెను విడిపించుకున్నాడు.

"ఏమిటిది! నలుగురిలో!"

అని కోపంతో చీదరించుకున్నాడు. ఆమె వెంటనే అతని చెయ్యి వదిలేసింది ఏదో దిగ్భ్రమకలిగినట్లు! ఆమె గుండెల్లో ఎవరో సందులేకుండా శూలాలతో పొడిచినట్లయింది. ఆ వ్యధ బ్రతికిన న్నాళ్లు దహిస్తుందని ఆ క్షణాన తెలియలేదు.

శివయ్య వెళ్ళిపోయాడు. మతిలేనిదానిలా ఆమె అక్కడే చీకటి పడేవరకూ ఉంది. జనంవస్తున్న పోతున్న ఆమెకేమీ కనిపించలేదు. ఎవరైనా పలకరించినా ఆమెకు వినిపించలేదు. చీకటి పడుతుండగా మెల్లగా ఇంటికి వెళ్ళింది.

ఆ తరువాత ఆమె మంచం పట్టింది.

ఎన్నిసార్లు తెల్లవారిందో పొద్దు ఊకిందో ఆమెకు తెలియదు. క్షణక్షణము ప్రాణం పోతే బాగుండునన్న వేదన దహిస్తూ ఉంటే కాలం ఎట్లా గడుస్తోందో తెలియకుండా బ్రతికింది.

అంత ఆవేదనలోను శివయ్య మళ్ళా కనిపిస్తాడేమోనన్న ఆశ చావలేదు. అతనిని చూడాలన్న తపన తగ్గలేదు. కాని అతను మళ్ళా ఆమె జోలికి రాలేదు. ఆమెను చూడలేదు. ఆమె ఆవేదనతో అతనికి ఏ సంబంధము లేనట్లు మాయమైనాడు.

చాలారోజులకు ఆమెకు అర్థమైంది. అతనికి తనకోసం రావలసిన అవసరం లేదు. తనమీద అతనికి విపరీతమైన మమకారం ఉండవలసిన అవసరంలేదు. తాను పిలిచింది కాబట్టి అతను విలాసంగా ఒక్కక్షణం తనచేయి పట్టుకున్నాడు. నిర్లక్ష్యంగా మరుక్షణం వదలివేశాడు. అది అతని స్వభావం కావచ్చు ఎందరినో అతనలా విలాసంగా ఆదరించి ఉండవచ్చు. మరుక్షణం వదలి ఉండవచ్చు. వ్యర్థమైన మమకారంతో తాను కుమిలిపోతున్నది.

ఆ ఊహలతో ఆమె గుండె కోసుకుపోయింది. నిద్రలోకూడ విశ్రాంతిలేక ఉండిఉండి ఉలిక్కిపడి బాధపడింది. తనువు మనస్సు రెండూ చెదరి శిధిలమైనాయి. లోపల్లోపల ఏదో భయంకరంగా చితికిపోయి కంటికి కనిపించకుండా రక్తం ఎడతెగకుండా స్రవిస్తోంది. ఆ చితికిపోయినది మెదడో, హృదయమో, బ్రతుకో, కల్పించుకున్న భ్రమో, ఆమెకు స్పష్టంగా తెలియదు.

ఎప్పుడో ఎవరో చెప్పారు రమణయ్యకు, సంతలో శివయ్య మయూరి కలసి కనిపించినట్లు, ఆరోజు అతను ఆమెను చావగొట్టాడు. ఆమె అధోగతి పాలైనదని అతి నీచంగా తిట్టిపోశాడు. ఆమెముఖం చూడడంకూడా పాపమన్నాడు. మయూరి ఆ దెబ్బలు ఆ మాటలు ఓర్చుకుంది. ఆమె ఇంకా అతను కల్పించిన ఇంట్లోనే వున్నది. ఆమెను కొట్టటానికి, తిట్టటానికి, హింస పెట్టటానికి అతనికి ఇంకా అధికారమున్నది. అది నిజమే! ఆమె ఇప్పుడు అన్నివిధాల చెడిపోయిన మనిషి. ఆమెను చూడటమే పాపం.

ఆమెకూ అటువంటి నమ్మకమే కలిగింది. ఈ పాపం తనను బ్రతికినన్నాళ్లు దహిస్తుంది. బ్రతికినన్నాళ్ళు గుండె కుమిలిపోతుంది. ఇది విముక్తి లేని శాపం.

ఎప్పుడూ తన గుండెల్లో అంకురించిన మమకారం నశించదు. ఆమెది పరాధీనమైన బ్రతుకు. ఏవేపు చూచినా ఆమెకు అంత ఆవేదనలోను శివయ్య ముఖమే కనిపిస్తుంటుంది. నిరంతరంగా అతనికోసరమే కన్నీరు కారుతూ ఉంటుంది. అతను అతి నిర్దయగా తన్ను వదలి వెళ్ళిపోయాడని హృదయం దహించుకుపోతుంటుంది. ఎవరు ఎంత కొట్టినా, తిట్టినా, నీచంగా చూచినా ఆ మమకారం నశించదు. ప్రాణంపోతున్న కొనఊపిరితో అతను కనిపిస్తాడేమోనని అటూ ఇటూ వెతుక్కుంటూ ఉంటుంది. అది తప్పదు. అది మమకారమో ఉన్మాదమోకూడ ఆమెకు తెలియలేదు.

ఆమె నిగ్రహం కోలుపోయింది. ధైర్యం కోలుపోయింది. బ్రతకాలన్న కోరిక కోలుపోయింది. శిథిలమైన గుండెలో స్రవించే కన్నీటిని అరికట్టడం ఆమెకు సాధ్యంకాలేదు. అది ఎడతెగకుండా కంటివెంట కారుతూనే ఉన్నది. ఒక్క క్షణమైనా ఆగదు. ఆ కన్నీరు ఎవరైనా చూస్తారేమోనన్న భయం మాత్రం మిగిలింది. అందుకే అది కనబడకుండా ప్రతిక్షణం కళ్ళు నులుపుకొంటూ అలవాటుచేసుకుంది. క్రమంగా కళ్ళు ఎఱ్ఱగా మారిపోయాయి.

ఆమె ఇల్లువదలి వెళ్ళిపోయింది. అనాధగా ప్రారంభించిన బ్రతుకును చివరకు అనాధ శరణాలయానికే చేర్చుకున్నది. అక్కడ ఆమెకు ఏదో ఊరట కలిగింది. ప్రతిక్షణం గుండె దహించుకుపోతున్న చేయవలసిన పని ఏదో బరువుగా సాగుతున్నది.

అది ఆమె కథ. ఎవరితోనూ చెప్పలేని వ్యథ. అందుకే కాంతమ్మ ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పలేదు. ★

